# జీవన పోరాటం

## వెన్నెల
## విరగబడి కాస్తోంది.

ఆరుబయట డాబామీద వెన్నెలలో తడిసిపోతూ నీల నిలబడి ఆలోచిస్తోంది. ఈ వెన్నెల, వెలుగు ఎంత అద్భుతంగా ఉంది. సృష్టి జీవకోటికి ప్రసాదించిన ఈ వెన్నెల వెలుగు ఎంతమందికి వెలుగు చూపుతోంది? బయటకు రాకుండా చీకటిలో మగ్గిపోయేవారికి ఈ ఆనందం ఎలా తెలుస్తుంది? ఈ వెన్నెల వెలుగు అనుభవించడానికి సంస్కారం కావాలి. పోరాటం చెయ్యాలి. చీకటి లోంచి బయటకు రావటానికి ప్రయత్నించాలి. పెనుగులాడాలి, విజయం సాధించాలి.

గతస్మృతులతో నీల...

ఇంట్లోకి వస్తూనే బాబాయి పిలుపు.

ఛెంగున ఎగురుకుంటూ బాబాయి దగ్గరకు పరుగుతియ్యటం... ఆయన ఎత్తుకుని ముద్దాడి, కబుర్లు చెప్పించుకుని, కావలసినవి కొనిపెట్టడం.

లీలగా ఊహతెలిసినప్పటి జ్ఞాపకం.

ఆ తరువాత స్కూలుకి వెళ్ళటం.

తన చదువు విషయం బాబాయ్ శ్రద్ధ చూసేవాడు. పాసయినప్పుడల్లా బహుమతులు కొనివ్వడం, ఫస్ట్‌క్లాసు వచ్చినప్పుడల్లా మురిసిపోవటం బాబాయి జీవిత ధ్యేయంగా ఉండేది.

అత్తయ్య పెళ్ళి జరిగింది. మావయ్య ఎంతో మంచివాడు. నిమలని ఈ చేతులతో పెంచాను. కన్నతల్లిలా చూసుకునే అత్తగారు దొరికారు. అంతే చాలు అనుకునేది అమ్మ. నాన్నగారు విశ్వం మావయ్యను అపురూపంగా చూసుకునేవారు.

అప్పుడప్పుడు బాబాయి "అన్నయ్యా నాకన్నా విశ్వం అంటేనే నీకు ఎక్కువ ఇష్టం కదా!" అనేవాడు.

నాన్నగారు ముసిముసిగా నవ్వుకునేవారు.

టెన్త్ క్లాసు పరీక్ష వ్రాసిన తరువాత సెలవులకు అత్తయ్య అత్తగారి వూరు వెళ్ళింది. అత్తయ్య అత్తగారు "ఈ పిల్ల మాకోడలి అన్నగారి అమ్మాయి కోడలికి చిన్నప్పుడే తల్లిదండ్రి చనిపోతే వాళ్ళ అన్నవదిన పెంచి, పెద్ద చేశారు. ఎంతో మంచి వాళ్ళు ఈ కాలంలో అలాంటి వాళ్ళు ఉండరు" అంటూ ఎంతో అభిమానంగా ఇంటికి వచ్చిన వారందరికీ చెప్పేది. వాళ్ళింట్లో ఉన్న నాలుగు రోజులు ఎంతో సంతోషంగా గడిచిపోయాయి.

బాబాయి ఇంజనీరు. ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం వచ్చింది. పెళ్ళి అయింది. పిన్ని వచ్చింది.

అమ్మా, నాన్న వాళ్ళను విడిగా ఉండమని చెప్పారు.

"అమ్మాయి చదువుకుంది. అభిరుచులు వేరుగా ఉండవచ్చు. తన సంసారం తనకుండాలని అనుకుంటుంది కదా! మనస్సులు కలిసి ఉండాలి కాని వేరు కాపురం అయినా ఫరవాలేదు" అన్నారు నాన్నగారు.

"నా మనస్సులో ఎవరి స్థానం వారిదే. కొత్తగా వచ్చిన భార్య అభిప్రాయం మన్నించమని అన్నయ్య చెపుతున్నారు. కాబట్టి శాంత ఎలా చెయ్యమంటే అలా చేస్తాను" అన్నారు బాబాయి.

హాలులో అంతా సమావేశమయ్యారు. తను బాబాయి ప్రక్కన కూర్చుంది. తమ్ముడు పిన్నిని వదలడు. ఎప్పుడూ ఆవిడ వెనకాలే ఉంటాడు. అప్పుడు కూడా పిన్ని ప్రక్కనే కూర్చున్నాడు. వాడు సెవెంత్ క్లాసులో ఫస్ట్ రావాలని పిన్ని పట్టుదలతో పాఠాలు చెపుతూ ఉంటుంది. అమ్మకూరగాయలు తరుగుతూ కూర్చుంది. నాన్నగారు పడకకుర్చీలో ఆసీనులయ్యారు.

అమ్మమ్మ తాతయ్యలకు అమ్మ ఒక్కతే కూతురు. నాన్నగారు అమ్మమ్మకి స్వంత తమ్ముడే. తాతయ్య, అమ్మమ్మ ఇంట్లోనే ఉండేవారు.

బాబాయి మాటలు వినగానే పిన్ని అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి "చూశావా పెద్దమ్మా వీళ్ళంతా నన్ను వేరే వెళ్ళమని అంటున్నారు. ఇది న్యాయంగా ఉందా?" అంది పిన్ని.

తమ్ముడు కూడా పిన్నితో పాటు లేచి ఆవిడ వెనకాలే వెళ్ళాడు.

"అదికాదు శాంతమ్మా నువ్వు చిన్నపిల్లవు. ఇక్కడ మేమంతా ఉంటాము కదా! నీకు గొడవగా, గోలగా అనిపించవచ్చు. కొత్తకాపురం విడిగా ఉండాలని ఎవరికైనా ఉంటుంది. ఈ దగ్గరలోనే ఇల్లు తీసుకుంటే వస్తూ, పోతూ ఉండవచ్చు" అంది అమ్మమ్మ.

"పిన్ని వాళ్ళు విడిగా వెళ్ళిపోతే నేను కూడావాళ్ళతోనే వెడతాను. పిన్నీ నేను కూడా మీతో రావద్దా?" అన్నాడు తమ్ముడు.

బాబాయి నావైపు చూశాడు.

నేను ఓ.కె. చెప్పేశాను.

"మేము విడిగా వెళ్ళటం లేదులే రవీ! ఒక వేళ వెళ్ళవలసి వస్తే నిన్ను తీసుకుని వెళ్ళకుండా వెళ్ళము" అంది పిన్ని.

"నీల మనతోనే వస్తుంది" అన్నాడు బాబాయి.

"మరీ సంతోషం పెద్దమ్మా, నువ్వు, పెదనాన్న ముందు కొన్నాళ్ళు మా దగ్గర ఉండాలి. నాకు వంట సరిగా రాదుకదా!" అంది పిన్ని.

"అన్నయ్య, వదిన మనతోనే ఉంటారు" అన్నాడు బాబాయి.

సి.భారతి

"బాగానే ఉంది. ఇంకా విడిగా వెళ్ళటం ఎందుకు?" అంటూ నాన్నగారు అక్కడనుంచి లేచి బయటకు వెళ్ళిపోయారు.

ఇంటరు పరీక్షలు వ్రాసింది.

శెలవులకు అత్తయ్య వాళ్ళవూరు రమ్మంది. బాబాయి ససేమిరా ఒప్పుకోలేదు.

"సీలని ఎక్కడికి పంపవద్దు. అది ఎప్పుడూ నా కళ్ళకెదురుగా ఉండాలి" అన్నాడు బాబాయి.

"ఏమిటోయ్ కూతురికి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపరా?" అన్నారు తాతగారు.

"మేము పంపము అల్లుడిని ఇంటికి తెచ్చుకుంటాము" అన్నాడు బాబాయి సరదాగా.

"మీ ఒక్కరికే కూతురి మీద ప్రేమ" వెక్కిరించింది పిన్ని.

"నీకు తెలియదు ఊరుకో" కసిరేసాడు బాబాయి పిన్నిని

తరచుగా అత్తయ్య, మావయ్య వచ్చేవారు. వాళ్ళు వచ్చినప్పుడు ఇల్లంతా సందడి. పండుగలాగా ఉండేది.

బాబాయికి బాబు పుట్టాడు. పసిపిల్లాడితో అమ్మకి క్షణం తీరేది కాదు.

అత్తయ్యకి కూడా పాప పుట్టింది. అమ్మ, అమ్మమ్మకి ప్రొద్దుచాలేది కాదు.

తాతగారు కూడా ఎక్కువ సేపు పసిపిల్లలను ఆడిస్తూ కాలక్షేపం చేసేవారు.

బి.కాంలో జాయిన్ అయింది. పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారు. బాబాయికి ఏ సంబంధం నచ్చేది కాదు.

"ఇలా అయితే పెళ్ళి చేసినట్లే" అనేవారు నాన్నగారు.

"ఒరే అమ్మడూ! నేను ముసలివాడిని అయినతరువాత నీ దగ్గరే ఉంటానురా. అప్పుడు నాకేం చేసి పెడతావు?" అనేవాడు బాబాయి.

"నీకు పాయసం ఇష్టం కదా అదే చేసి పెడతాను" అనేది తాను.

"నీవు బంగారు తల్లివిరా" అనేవాడు బాబాయి.

"నీలా నేను కూడా మీ ఇంటికి రానా" అనేది అత్తయ్య

"నీకు చీరలు ఇష్టం కదా! మంచి చీరలు కొంటాను"

"ఆ తల్లిదండ్రుల పిల్ల... గుణం బంగారం" అనేవాడు మావయ్య.

"పెద్దవదినే కన్నతల్లి అనుకున్నాను. చిన్నవదిన కూడా అందుకు సరిపోయింది. నా విషయంలో నా చిన్నారి మేనకోడలు కూడా కన్నతల్లిలా మాట్లాడింది" అత్తయ్య కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"ఊరుకోవమ్మా అన్నిటికీ చలించిపోతావ్. నీ మనస్సు మంచిది కాట్టే ప్రతి చిన్న విషయం నీకు గొప్పగా ఉంటుంది" అంది అమ్మ అత్తయ్యని.

"మీ ఇంటికి వస్తే తిరిగి వెళ్ళాలని అనిపించదే" అనేది క్లాస్‌మేట్ రోజీ.

అమ్మని, అత్తయ్యని, బాబాయిని తనలాగా పిలిచి తన వెనకనే తిరిగేది ఇంకో క్లాస్‌మేట్ రేణు.

ఉన్నదాంట్లో సంతృప్తిగా గడిపిన ఆ జీవితం ఆ వెన్నెల, వెలుగు ఏమయ్యాయి. అకస్మాత్తుగా తను చీకట్లోకి విసిరేయబడింది.

బి.కాం చివరి సంవత్సరంలో పరీక్షల ముందు పెళ్ళి నిశ్చయమయింది. పెళ్ళికొడుకు బాబాయికి నచ్చాడు. ఈడూ, జోడూ బావుందని సంతృప్తి చెందాడు. కాని నీల పరీక్షలు అయిన తరువాతే పెళ్ళి జరగాలని వాదించాడు బాబాయి.

వాళ్ళు ముందే జరగాలని పట్టుబట్టారు, అమ్మ బాబాయికి నచ్చచెప్పింది.

బాబాయి భృకుటి ముడిపడింది. ఆలోచనలో పడ్డాడు. నాన్నగారు వాళ్ళకి అతికష్టంమీద నచ్చచెప్పి పరీక్షలు వ్రాయించారు.

రిజల్టు తెలిసిన రోజున తను అత్తవారింట్లో ఉంది. ఊళ్ళోనే కదా ఉండేది పేపరు తీసుకుని పరిగెత్తుకుని వచ్చాడు బాబాయి.

బాబాయి వచ్చిన అరగంటకి కాని ఆయన రాక సంగతి తనకి తెలియలేదు. ఆయన వచ్చిన సంగతి ఎవరూ తనకు చెప్పలేదు. పని మధ్యలో బయటకు వచ్చిన తనకు బెంచిమీద కూర్చున్న బాబాయి కనిపించారు.

"ఎప్పుడు వచ్చావ్ బాబాయి. ఇక్కడ కూర్చున్నావేమిటి? లోపలికి రా" అంది.

"నేను వచ్చి అరగంటయిందమ్మా. ఇంత సేపు ఏం చేస్తున్నావ్. నీవు ఫస్ట్‌క్లాసులో పాసయ్యావు తెలుసా?"

"నిజంగానా" అంటూ ఆతృతగా పేపరు అందుకుంది. నెంబరు చూసుకుని "లోపలికి వచ్చి కూర్చో బాబాయ్ పాయసం చేసి పెడతాను"

"ఇప్పుడు వద్దురా అమ్మడూ"

"నేను చేసి పెట్టిన పాయసం నువ్వు తిని వెళ్ళాలి" పట్టుబట్టింది తాను.

కాదనలేకపోయాడు.

సంతోషంగా లోపలికి వెళ్ళి పాయసం చేయటం మొదలు పెట్టింది.



"ఏమిటే చెయ్యబోతున్నావ్? పాయసమా? మా పిల్లలూ చదివారు కాని ఈ నంబడం నాకు తెలియదు"

ఆ ఇంటి వాతావరణం బాబాయికి కన్నీళ్ళు తెప్పించాయి. కళ్ళు ఎర్రబారాయి.

నవ్వుతూనే తన వైపు చూస్తూ పాయసం అందుకున్నాడు. ఆ కళ్ళల్లో క్రోధం, బాధ, జాలి తనను కలవరపెట్టాయి.



ఇళ్ళస్థలం ఏదో బేరానికి వచ్చిందని అనుకున్నారు.

"మీ వాళ్ళనడిగి డబ్బు తీసుకురాకూడదూ! స్థలం కొన్నా మీకే ఉంటుంది కదా. మీ బాబాయి ఇవ్వకూడదా? నీమీద ఈగవాలనివ్వడుగా. అదంతా వొట్టొట్టి ప్రేమేనా?

తనలోని అగ్ని రాజుకుంది. బాబాయిని అనటానికి వీళ్ళెవరూ?

నోరు విప్పింది. "మీ దగ్గర డబ్బు ఉంటే మీకు కావలసినవి కొనుక్కోండి. మా వాళ్ళని నేను డబ్బు అడగను"

స్కూటరు కావాలంటే బాబాయి తను వాడుకునేది ఇచ్చాడు. నా పెళ్ళి కోసం నాన్న, బాబాయి వాళ్ళ దగ్గర ఉన్న డబ్బంతా ఖర్చు పెట్టారు. మా తమ్ముడు చదువుకోవద్దా? బాబాయి పిల్లలు పెద్దవాళ్ళు కావటంలేదా?

"అబ్బో అన్నీ నీవే చెపుతున్నావ్ అంతగతి లేని వాళ్ళు మా సంబంధం కోసం ఎందుకు వచ్చారు?"

"మీదేమైనా రాయల్ కుటుంబమా" రాజుకున్న అగ్ని మాటలు రాల్చింది.

"ఏమిటే వాగుతున్నావ్"

క్షణం తటపటాయించింది. అది సమయం కాదని తమాయించుకుంది. నిశ్శబ్దంగా అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఆ తరువాత ఆగని కన్నీరు. జీవితం మీద విరక్తి: ఎడతెగని ఆలోచనలు. కొంతసమయం గడిచేసరికి ధైర్యం వచ్చింది. చచ్చిసాధించేది లేదు. తను నీరసపడిపోకూడదు. నిస్పృహ చెందకూడదు. బ్రతుకే ఒక పోరాటం. శాంతి కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. సైనికుడు యుద్ధరంగంలో పోరాడుతున్నాడు. ప్రజలు పేదరికంతో, అనారోగ్యంతో విపత్కర పరిస్థితులతో పోరాడుతున్నారు. రెండు కుటుంబాల అలవాట్లు, ఆలోచనలు, రెండు మనస్సుల సమన్వయం కలయిక జరగాలంటే కొంత పోరాటం, శ్రమ తప్పదు. కొందరి జీవితం వడ్డించిన విస్తరి లాగా ఉంటే మరికొందరికి కృషి, శ్రమ, ఓర్పు నేర్పు ఉంటేనే కాని జీవితం చక్కబడదు. అందుకు తాను మానసికంగా సిద్ధపడాలి అనుకుంది నీల. వెన్నెల మరింత వెలుగు విరజిమ్మింది. ○